# విపశ్యన మాసపత్రిక

VOLUME:35 NO - 26 1 MAY, 2020

(సాధకుల ప్రేరణ కొరకు ఉద్దేశించబడిన తెలుగు మాసపత్రిక)

విపశ్యన అంతర్జాతీయ ధ్యాన కేంద్రం, ధమ్మఖెత్త, వనస్థలిపురం, హైదరాబాదు – 70

### "ధర్మవాణి"

*మా పమాదమనుయుంజేథ, మా కామరతిసంథవం !*
*అప్పమత్తో హి ఝాయన్తో, పప్పోతి విపులం సుఖం !*

*– ధమ్మపద – 27, అప్పమాదవగ్గో*

ప్రమత్తుడవై ఉండవద్దు, అలాగే కామభోగాల్లో లీనమైపోవద్దు, ఎందుకంటే అప్రమత్తంగా ఉండే ధ్యానసాధన చేసే సాధకులు (మార్పుచెందని) అపరిమితమైన నిర్వాణ సుఖాన్ని ప్రాప్తించుకుంటారు.

## విపశ్యనా సాధన స్వర్ణ జయంతి సందర్భంగా పూజ్య గురూజీ పట్ల కృతజ్ఞతను ప్రకటించుకునే సదవకాశం

**(మూలం: జూన్ 17, 2019 న వెలువడిన హిందీ మాసపత్రిక )**

*విపశ్యనా సాధన పునఃస్థాపితమై 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 3 జూలై 2018 నుండి గ్లోబల్ పగోడాలో, ప్రతిరోజూ ఒక్కరోజు శిబిరాలు క్రమబద్ధంగా నిర్వహించబడుతున్నాయి. ఈ శిబిరాలు సాధకులు తమ నిత్య, సాధనను బలపరుచుకోవటానికి ఉపయోగపడుతుందని ఆశించటం జరుగుతోంది. సాధకులు ఏరోజు సమయం దొరికితే, ఆ రోజు ఈ శిబిరాల నుండి ప్రయోజనం పొందవచ్చు. వీటితో సాధకుల సాధనలో కూడా నిరంతరత మరియు క్రమబద్ధత వచ్చి, తద్వారా ఇతరులలో ప్రేరణ కలిగి సద్ధర్మం పట్ల ఆసక్తి కలిగితే, వీలయినంత ఎక్కువ మంది శిబిరాల్లో పాల్గొని, తమ మేలు చేకూర్చుకుంటారు. ఇదే విధంగా, ఇతర ప్రాంతాల్లో కూడా, రోజువారీ సాధన, సామూహిక సాధన మరియు ఒక్కరోజు శిబిరాల ద్వారా ఈ విద్య యొక్క వ్యావహారిక పక్షాన్ని అంటే సాధన యొక్క ఆచరణను దృఢపరుచుకోడానికే ఈ శిబిరాలు జరుపుకోబడ్డాయి. ఇదే పూజ్య గురుదేవుల పట్ల మనం చూపించే అసలైన శ్రద్ధాంజలి, నిజమైన కృతజ్ఞత అవుతుంది.*

*విశ్వ విపశ్యనాచార్యులు పూజ్య శ్రీ సత్యనారాయణ గోయంకా గారు శుద్ధ ధర్మంతో సంపర్కంలోకి రాకముందు, వారి బాల్యం నుండి యవ్వన దశ వరకూ జరిగిన సంఘటనల వర్ణనల ఆధారంగా వారిలోని భక్తిమార్గ భావాన్ని గురించి ఎలాంటి భ్రమా కలగకూడదు, పైపెచ్చు, ధర్మం చేత అలాంటి వ్యక్తిలో కూడా ఎంతలా మార్పు వచ్చిందో తెలుసుకొని ప్రేరేపితులౌతారనే ఉద్దేశ్యంతోనే, వారి ఈ సంక్షిప్త జీవిత పరిచయం, వారి మాటల్లోనే*

*– పదవ భాగం.*

## చార్వాకము మరియు బుద్ధుడు

చార్వాకతత్వము అత్యంత ఇహలౌకిక సుఖవాదతత్వం. మరణించిన తరువాత పునర్జన్మ ఉంటుందని అది నమ్మదు. కాబట్టి, ఈ జన్మలో మనం చేసే సత్కర్మల సత్ఫలితాలను మరియు దుష్కర్మల దుష్ఫలితాలను అనుభవించటానికి స్వర్గం కానీ నరకం కానీ ఏవీ లేవు. పుట్టినప్పటి నుండి మరణించటం వరకూ ఉన్న కాలమే జీవితకాలం. అందుచేత, ఈ కాలంలో ఎన్ని మోసాలు చేసైనా సరే, ఎన్నెన్ని ఇంద్రియ సుఖాలను అనుభవించగలిగితే అన్నన్ని సుఖాలను అనుభవించటమే తెలివైన పని అని అది చెబుతుంది.

**"యావజ్జీవం సుఖం జీవేన్నాస్తి మృత్యోరగోచరః ।**
**భస్మీభూతస్య దేహస్య పురాగమనం కుతః ॥"**

– బతికినంతకాలం సుఖంగా బతకాలి. ఎందుకంటే మృత్యువు నుండి ఎవ్వరూ తప్పించుకోలేరు. మరణించిన తరువాత ఏ శరీరాన్నయితే తగలబెట్టి బూడిద చేస్తారో, అది మళ్ళీ పురాగమనం, అంటే పునర్జన్మ ఎలా తీసుకుంటుంది? అదేవిధంగా మన సుఖభోగాల/ విలాసాల కొరకు ఇతరులను మోసగించటంలో ఎటువంటి దోషమూ లేదు, ఎందుకంటే దుష్కర్మలకు ఎటువంటి దుష్ఫలితమూ ఉండదు... అనేది చార్వాకవాదం.

బుద్ధ భగవానుని సమయంలో కూడా ఉచ్ఛేదవాదతత్వానికి (ఆత్మ కూడా నశించిపోతుందని బోధించే సిద్ధాంతం) చెందిన కొందరు వ్యక్తులు పాపపుణ్యాలను అంగీకరించేవారు కాదు. ఆ కాలం నాటి

పూర్ణకాశ్యపుని వంటి వారి అభిప్రాయంలో, ఎన్ని రకాల హింసలు చేసినా, ఎన్ని దుష్కర్మలు చేసినా, వాటి నుండి ఎటువంటి దుష్ఫలితమూ ఉండదు. సత్కర్మలు – దుష్కర్మలు అంటూ ఏమీ ఉండవు. మనం చేసినవన్నీ ఈ జన్మలోనే, ఇక్కడే సమాప్తమైపోతాయి.

అదేవిధంగా అజితకేశకంబలుడి వంటి వారి అభిప్రాయంలో, పుట్టినవన్నీ మరణించి పంచతత్వాల్లో విలీనమైపోతాయి. పాపము – పుణ్యముల వంటివి ఏవీ ఉండవు.

***"యావజ్జీవేత్ సుఖం జీవేత్, ఋణం కృత్వా ఘృతం పీవేత్"***

– జీవితం ఉన్నంత వరకూ విందు విలాసాలతో జీవించాలి. నేతిగారెలు తినాలనిపిస్తే అప్పు చేసయినా తినాల్సిందే. సుఖభోగాలను పొందటానికి ఏమిచేసినా ఫరవాలేదు. దానివల్ల ఏ పాపమూ – పుణ్యమూ అంటదు.

ఈ విషయాన్ని భగవద్గీతలో శ్రీకృష్ణుని చేత అర్జునునికి – "కేవలం శరీరమే మరణిస్తుంది. ఆత్మ అమరమైనది. ఆత్మను ఏదీ ఏమీ చేయలేదు. యుద్ధంలో మన బంధుమిత్రులను చంపటంతో ఏలాంటి పాపమూ అంటుకోదు. కొత్త బట్టలు దొరికినప్పుడు పాత బట్టలు మార్చుకున్నట్లే, శరీరం నశించినప్పుడు, దానికి బదులుగా ఆత్మ మరొక శరీరంలోకి వెళ్ళిపోతుంది. ఎందుకంటే ఆత్మకు మరణం లేదు" అని బోధించబడినది. కానీ నేను మాత్రం హింసను ఎప్పటికీ చెడుగానే భావించేవాడిని.

## ఆస్తికవాదము – నాస్తికవాదము

"పండితుడైనా, పామరుడైనా, మరణించగానే శరీరం నశించిపోతుంది. మరణించిన తరువాత ఎవ్వరూ మిగలరు. ఆస్తికవాదం శుద్ధ అబద్ధము."

"పాపపుణ్యాలకు మంచి–చెడు ఫలితాలుండవు. ఇహలోకం, పరలోకం అంటూ ఏమీ ఉండవు. దానమిచ్చే వారి దానానికి ఎటువంటి పుణ్య ఫలితమూ ఉండదు".

ఇలాంటి నమ్మకం కల వ్యక్తులను నాస్తికులుగా పిలిచేవారు.

కానీ బుద్ధ భగవానుడు అత్యంత ఆస్తికుడు.

ఆ కాలపు భారతదేశంలో కర్మలను, కర్మఫలాల ప్రకృతి నియమాల అస్థిత్వాన్ని నమ్మేవారిని ఆస్తికులు అనీ, వాటిని నమ్మనివారిని నాస్తికులు అనీ భావించేవారు.

– అయితే, ఈ విషయంలో బుద్ధుడు ఎప్పుడూ అంటుండేవారు... "ఈ నాస్తికుల మిథ్యానమ్మకాలు సరైనవి కావు" అని. ఆయన ఇహ–పర లోకాల అస్తిత్వాన్ని అంగీకరించేవారు. వ్యక్తి కర్మలను బట్టి వాటికి తగ్గ ఫలితాలను అనుభవించక తప్పదు అన్న సనాతన, నైసర్గిక నియమాల సత్యం ఆయనకు బాగా తెలుసు – ఈ విషయాన్నే వారు అంగీకరించే వారు కూడాను. దానినే ప్రజలకు కూడా బోధించేవారు. వారి బోధన ఏమిటంటే... "అన్ని పాపకర్మల నుండి బయటపడండి, సత్కర్మలు చేయటంలో నిమగ్నంకండి..." గృహస్థులకైనా, గృహత్యాగులైన భిక్షువులకైనా, ప్రతి ఒక్కరికీ ఆయన ఇచ్చిన మంగళకర ఉపదేశం ఇదే. అందువల్లనే వారు అత్యంత ఆస్తిక శిక్షణాచార్యులయ్యారు. దురదృష్టవశాత్తూ ఆ తరువాతి కాలంలో, ప్రకృతి నియమాలను నమ్మని నాస్తిక చార్వాకతత్వాన్ని మరియు ప్రకృతి ధర్మాల అస్తిత్వాన్ని నమ్మే ఆస్తికవాద బుద్ధుడిని ఒకే వరుసలో చూడటం జరిగింది.

కర్మల మరియు కర్మఫల సిద్ధాంతాలను తిరస్కరించిన కారణంగా చార్వాకవాదం కామభోగ సంబంధ దురాచారాలకు వత్తాసు పలికింది. వారి నమ్మకమేమిటంటే –

***"అంగనాద్యాలింగనాదిజన్యం సుఖమేవ పురుషార్థం॥"***

– పురుషార్థము అంటే... సుందరమైన శరీర సౌష్టవాలు కలిగిన స్త్రీల ఆలింగన సుఖాన్ని భోగించటమే. దీనర్థం, అందులోనే పురుషుని జీవితానికి సార్థకత ఉంది. పురుషుని జీవితానికి ఇంతకంటే మరో అర్థం లేదు.

కాబట్టి, కామభోగాల వైపు ప్రేరేపించే తత్వాన్ని ఉద్బోధించే చార్వాకవాదం ఎక్కడ?... స్వయంగా తాను బ్రహ్మచర్య జీవితాన్ని జీవించటమే గాక సాధకులు సహజ బ్రహ్మచర్యంతో జీవించగలిగే శుభప్రదమైన విపశ్యనా విద్యను బోధించే బుద్ధుడు ఎక్కడ! ఈ ఇద్దరినీ ఒకే తాటిన కట్టడం ఎంతటి అనుచితమైన పనో చూడండి?!

## బ్రహ్మచర్య పాలన

బోధిసత్వుడు సంబోధిని పొందకుండా అడ్డంకులు కలుగచేయటంలో ముక్తి మార్గ అవరోధకుడైన మారుడు విజయం సాధించడంలో విఫలమైనప్పుడు అతని అందమైన ముగ్గురు కుమార్తెలు బోధిసత్వుని మనసులో కామవాంఛను కలగచేయటానికి ప్రయత్నశీలురయ్యారు. కానీ బోధిసత్వుని సంకల్పం ముందు వారు కూడా పూర్తిగా విఫలమయ్యారు. ఇక సంబోధిని సాధించి, సిద్ధార్థుడు సమ్యక్ సంబుద్ధుడయ్యాక, కామభోగాల వాంఛ ఉదయించటం పూర్తిగా పరిసమాప్తమైపోయింది.

ఒక సంఘటన –

## మాగంధీయ

బ్రాహ్మణ మాగంధీయుని పుత్రిక మాగంధీయా అత్యంత సౌందర్యరాశి. ఎవ్వరూ వేలెత్తి చూపలేనటువంటి అందం, బంగారు మేని ఛాయ ఆమె సొంతం. పెళ్ళీడుకొచ్చిన కూతురికి తగిన వరుడిని తండ్రి వెదుకుతున్నాడు. కానీ అతని మనోగతం ఏమిటంటే, కూతురి అందచందాలతో, సువర్ణవర్ణ మేని చాయతో సరితూగ గల పురుషునితోనే ఆమె వివాహం జరిపించాలి. కానీ అంతటి రూపవంతుడైన వరుడు తన బ్రాహ్మణ సమాజంలో కానీ, రాజ కుటుంబంలో కానీ ఎంతవెదికినా కానరాలేదు. అయితే, ఒకానొక సందర్భంలో అతడు బుద్ధ భగవానుని చూడటం జరిగింది. మాగంధీయునికి బుద్ధుని సుందర మనోహర రూప సౌందర్యం ఎంతగానో ఆకట్టుకుంది. తన కుమార్తెకు కావలసిన వరుడు ఇతడే అనుకున్నాడు. వెంటనే ఇల్లు చేరుకుని కూతురిని సర్వాంగసుందరంగా అలంకరింపచేయించి వేగిరపాటున కూతురుని వెంట బెట్టుకుని బుద్ధుడి వద్దకు వచ్చాడు. "నీ వంటి సౌందర్యమూర్తికి తగిన సౌందర్యరాశి నా కూతురే. ఇద్దరూ ఒకరికొకరు సరిజోడిగా ఉన్నారు. కాబట్టి ఆమెను చేపట్టి వివాహమాడవలసింది" అని వేడుకున్నాడు. అయితే భగవానుడు మాగంధీయుని విన్నపాన్ని తిరస్కరించాడు. కానీ మాగంధీయుడు పట్టువదలకుండా ప్రాధేయపడటం మొదలుపెట్టాడు. అయినా, సమ్యక్ సంబుద్ధుని వంటి గృహత్యాగ బ్రహ్మచారి పెళ్లి చేసుకుని గృహస్థ జీవితాన్ని చేపట్టాలన్న అభ్యర్థనను ఎలా స్వీకరించగలడు చెప్పండి? నిజానికి దేశంలోని గొప్పగొప్ప ధనికులు, ఐశ్వర్యవంతులైన బ్రాహ్మణులు, క్షత్రియ యువకులు ఏ కన్యారత్నమును భార్యగా పొందటం తమ గొప్ప అదృష్టంగా భావించేవారో, అలాంటి సౌందర్యరాశిని బుద్ధుడు నిరాకరించడం బ్రాహ్మణ మాగందీయునికి అత్యంత ఆశ్చర్యం కలిగించింది. ఎంత ప్రయత్నించినా అతని ప్రయత్నం ఫలించలేదు.

ఇక బుద్ధుని విషయానికి వస్తే, వారి శిష్యులైన భిక్షువులు కూడా బ్రహ్మచర్యాన్ని చేపట్టి, దానిని ఎంతో ఖచ్చితంగా పాటిస్తారు

*"అబ్రహ్మచరియా వేరమణి – సిక్ఖాపదం సమాదియామి।"*

– నేను అబ్రహ్మచరియం నుండి విరతుడనవుతాను అనే శిక్షాపదాన్ని స్వీకరిస్తున్నాను.

–ఖుద్దకపాఠ, 2.3

బుద్ధుని బోధనలు పాటించే సాధారణ గృహస్థులు కూడా పంచశీలాలు స్వీకరించినప్పుడు వాటిలో ఇది కూడా ఒక నియమం–

*"కామేసుమిచ్ఛాచారా వేరమణి సిక్ఖాపదం సమాదియామి"।*

– నేను కామసంబంధమైన మిథ్యాచరణ, అనగా వ్యభిచర్యం నుండి విరతుడనవుతాను అనే నియమం స్వీకరిస్తున్నాను.

– దీఘనికాయ, 1.130

విపశ్యనా సాధకుల్లో దాదాపు అందరూ దానిని పాటిస్తారు. మరికొందరైతే విపశ్యనా విద్యను లోతుగా అభ్యాసం చేస్తూ సహజంగానే బ్రహ్మచర్యాన్ని పాటించే స్థితికి చేరుకుంటారు. ఇలాంటి సచ్ఛీలత గల బుద్ధుడిని మరియు వారి అనుయాయులను చార్వాకము వంటి స్వేచ్ఛా దురాచార ప్రచారకుల వరుసలో నిలపటం ఎంతటి తప్పిదమో చూడండి! నిజానికి బుద్ధ భగవానుని మూలవాణి మరియు విపశ్యనా విద్య గనుక అందుబాటులో ఉండి ఉంటే ఇటువంటి పొరపాటు జరిగి ఉండేది కాదు కదా?

ఈ కారణాల వల్లనే బుద్ధ భగవానుని బోధనల ప్రభావం నా మనసులో ఎంతో లోతైన ప్రభావాన్ని చూపింది. పాప-పుణ్యాల పట్ల గల ఇలాంటి మిథ్యాభావనలు నా మనసు నుండి శాశ్వతంగా తొలగిపోయాయి. జీవితం సుఖమయమయింది, అర్థవంతమయింది.

## అపరివర్తనీయము (మార్పు చెందనిది)

బుద్ధుని బోధనలో నిరంతరం మార్పుచెందే స్థితి యొక్క దర్శనమే ఉందా? అందులో మార్పుచెందనిది అసలు ఏమీ లేదా?

బుద్ధుని బోధనలలో అన్నీ భంగురమైనవే, అనిత్యమైనవే. నిత్యమైనవి, మార్పు చెందనివంటూ ఏవీ లేవు అనే నిరాధారమైన నింద తరతరాలుగా బుద్ధునిపై మోపబడుతూ వచ్చింది. వందలాది సంవత్సరాల నుండి, మన దేశ ప్రజల మనసులపై ఈ మిథ్యా ఆరోపణల దట్టమైన పొరలు అలుముకున్నాయి. ఈనాటి వరకు కూడా ఎంతో మంది ప్రజలు బుద్ధుడు దుఃఖవాది, అనిత్యవాది అనే నిందారోపణలతో విపశ్యనను వ్యతిరేకిస్తారు. అనిత్యతా ధ్యానమే విపశ్యనా సాధన యొక్క ఏకైక లక్ష్యం అనే భ్రమ ఎంతో మంది మనసుల్లో పాతుకుపోయి ఉంది. కానీ విపశ్యన సాధన చేసేవారికి – "ఈ శరీరచిత్తాల ఇంద్రియ క్షేత్రము యొక్క అనిత్యతను (అశాశ్వతతను) ఎందుకు అనుభూతి చెందుతున్నాము" అన్నది చక్కగా తెలుస్తుంది, దీనితో.... " శరీర చిత్తాలలో ఉదయించిన నేను, నాది అనే భావన నిలిచి ఉంటే రాగద్వేషాలు ఉదయిస్తాయి...", సాధన ద్వారా శరీరము మరియు చిత్తము "నేను కాదు", "నాది కాదు", "నా ఆత్మ కాదు" అని సాధకుడు స్వంత అనుభూతుల స్థాయిలో తెలుసుకోవటం మొదలుపెడతాడు. ఈ స్వీయ అనుభూతితో కలిగిన సత్యం ఎంతెంతగా పుష్టి చెందుతూ ఉంటే, శరీరచిత్తాల పట్ల ఉన్న "నేను", "నాది" అన్న భావన అంతంతగా బలహీనపడుతూ పోతుంది, నశించిపోతూ ఉంటుంది. ఈ దేహమే

నేను–నాది, ఈ చిత్తమే నేను–నాది అన్న భావనలు బలహీనపడుతూ పోతాయి, పరిణామంగా వీటిపట్ల ఉన్న రాగద్వేషాల ముడులు విడివడిపోతాయి. విపశ్యన సాధన చేస్తూ, ప్రతి క్షణమూ మార్పుచెందే సంవేదనల అనుభవైక జ్ఞానముతో... "ఏది అనిత్యమైనదో, ఏది అశాశ్వతమైనదో, ఏది ప్రతిక్షణం మార్పుచెందుతూ ఉంటుందో, దానిపట్ల ఏమని రాగం పుట్టించుకోవాలి, ఏమని ద్వేషం పుట్టించుకోవాలి?" అని స్వీయ అనుభవంతో ఆకళింపు చేసుకుంటాడు. కానీ తన పాత స్వభావానికి లోబడి అప్పుడప్పుడు ఏదైనా సుఖకర అనుభూతి కలిగితే దానిపట్ల ఆసక్తి కలిగించుకునే తప్పిదం చేస్తుంటాడు. కొద్దిసేపటి తరువాత ఆ సుఖకర సంవేదన మార్పుచెందుతూ సమాప్తమైపోతే, దానిపట్ల కనుక లోతైన ఆసక్తి ఉంటే, లోతైన దుఃఖానికి లోనవుతాడు. ఎంత లోతైన ఆసక్తి ఉంటే, అంతే లోతైన దుఃఖం కలుగుతుంది. ఇది ప్రకృతి యొక్క తిరుగులేని సత్యం. ఈ సత్యాన్ని కూడా పదే పదే మార్పు చెందే సంవేదనల స్థాయిలో అనుభూతి చెందుతూ ఉంటే దాని పట్ల ఉన్న ఆసక్తి కూడా క్రమక్రమంగా క్షీణించిపోతుంది. ఇదే సత్యాన్ని మళ్ళీ మళ్ళీ అనుభూతి చెందుతూ అవగతం చేసుకుంటూ ఉంటే దానిపట్ల ఉన్న ఆసక్తి స్వతహాగా నశించిపోతుంది. అప్పుడు ఇక కొత్త రాగం, కొత్త ద్వేషాలు ఉదయించవు, ఇది వరకు ప్రోగుచేసుకున్న పాత రాగద్వేషాలు నశించిపోవటం మొదలవుతుంది.

*"ఖీణం పురాణం నవ నత్థి సమ్భవం"*।

అప్పుడు ఇక చివరిగా శరీరచిత్తాల అనిత్య క్షేత్రానికి ఆవలగల ఇంద్రియాతీతమైన, నిత్యమైన, నశ్వరం కానటువంటి, శాశ్వతమైన నిర్వాణం సాక్షాత్కారమవుతుంది. అప్పుడు, ఈ ఇంద్రియ క్షేత్రమంతా అనిత్య ధర్మం కలదే, పరిణామం చెందుతూ ఉండే ధర్మం కలదే అని సాధకుడు స్పష్టంగా అర్థం చేసుకుంటూ పోతాడు. ఈ సత్యాన్ని అనుభూతిలోకి తెచ్చుకుంటూ **"మార్పుచెందని నిత్యమైన, ధృవమైన 'నిర్వాణాన్ని (ముక్తి, మోక్షాన్ని)"** సాక్షాత్కారం చేసుకోవటానికే సాధన చేయబడుతోంది. ఇదే విపశ్యన సాధన యొక్క అంతిమ లక్ష్యం.

కాబట్టి భగవానుని బోధనలోని అనిత్య దర్శనం, ఈ అనిత్యత నుండి బయటపడటానికే ఉందన్నది సుస్పష్టం. దుఃఖ దర్శనం చేసుకోవటం, ఆ దుఃఖం నుండి విముక్తి పొందటానికే అన్నది స్పష్టమవుతుంది. శరీరచిత్తాల అనాత్మ భావాన్ని దర్శనం చేసుకోవటం ద్వారా దాని నుండి బయటపడి నిత్య, శాశ్వత, మార్పుచెందని, అపరిణామాన్ని సాక్షాత్కారం చేసుకోవటానికే. ఇదేదో "అనిత్యదర్శనం" చేసుకోవటం ఏదో ఒక కర్మకాండను పూర్తిచేయాలనే ఉద్దేశ్యంతో చేయటం కాదు. ఏదో ఒక విధివిధానాన్ని పూర్తిచేయాలనే ఉద్దేశ్యంతో అనిత్యతను దర్శనం చేసుకోవటం లేదు. ఏదీ ఉదయించని, ఏదీ నశించని, చావుపుట్టుకలు లేని, అమృతమైన, నిర్వాణ నిత్యాన్ని దర్శించుకోవటమే అనిత్య దర్శనం యొక్క లక్ష్యం.

*– తరువాయి భాగం వచ్చే సంచికలో*

*– పూజ్య గురూజీ సత్యనారాయణ గోయంకా గారు రచించిన "ఆత్మ కథన్ 2" నుండి సంగ్రహించబడినది.*


రెండు సంవత్సరాలకు చందా రూ **100/-** | **విపశ్యన తెలుగు మానపత్రిక** | జీవిత చందా రూ. **500/-**

ప్రచురణ తేది: ప్రతినెల **30/31** | పోష్టింగ్ తేది: ప్రతి నెల **1/2** | వెల: రూ **5/-**

**విపశ్యన అంతర్జాతీయ ధ్యానకేంద్రం, నాగార్జున సాగర్ రోడ్, వనస్థలిపురం, హైదరాబాదు – 500 070.**

**ఫోన్: 24240290 (ధ్యానకేంద్రం)** ఆఫీసు పనిచేయు వేళలు: ఉదయం **9**గం॥ల నుండి సాయంత్రం **5** గం॥ల వరకు

Postal Reg. HSE/864/2019-2021 RNI Reg. No. APTEL/2006/17745


**PRINTED MATTER**

If Undelivered please return to :

**VIPASSANA INTERNATIONAL MEDITATION CENTRE,**
12/6KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram,
HYDERABAD - 500 070.
Website : www.vri.dhamma.org
E-mail : info@khetta.dhamma.org


Published for Vipassana International Meditation Centre, 12/6KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram, Hyd.(A.P)-70 Ph: 040-24240290, Published by Smt. Sabrina Katakam.
Editor : Sri G.V.Subrahmanyam., Printed at Sai Likhita Printers, #6-2-959, Dakshin Bharat Hindi Prachar Sabha Complex, Khairatabad, Hyd. Ph : 2332579.